# పోయిన సొమ్ము

మద్రాసు నుండి బెజవాడ వైపుకువెళ్ళే, మెయిలు రావటానికి ఇంకా గంటకుపైగా వ్యవధి ఉన్నది. ఎద్దు బళ్ళలో నుండీ, రిక్షా బళ్ళల్లో నుండీ దిగి స్టేషన్ లోపలకు చేరారు పెళ్ళివారంతా. వారంతా కలిసి ఓ పాతిక మంది దాకా ఉంటారు. కాని ఏ వందమందో ఉన్నంత సందడిగా ఉన్నది.

మరో పది నిమిషాలకు మధు పర్కాలతో ఉన్న చిన్నకొడుకునూ, క్రొత్త కోడలునూ వెంట పెట్టుకొని చౌదరిగారు చిన్నకారు దిగారు. బయట నిలబడి ఉన్న కొంతమంది బంధువులను చూచి "ఇంకా ఇక్కడే నిలబడ్డారేమర్రా పదండి మరి" అంటూ ఆయన ముందుకు సాగారు. సామానన్నీ వెయిటింగురూముకు చేర వేయించి, పెట్టెలపైనా, పరుపు చుట్టలపైనా కూర్చున్నారు కొంతమంది ఆడవాళ్ళు. మరి కొంతమంది మరుదులతో మరదళ్ళతో సరసాలాడుతూ నవ్వుతూ ఆ గది బయట నిలబడి ఉన్నారు. కొంతమంది మొగాళ్ళు వాళ్ళకు కొంచెం దూరంగా నిలబడి సిగరెట్లు బీడీలూ ముట్టించి తాపీగా పొగ తాగుతున్నారు. మరికొంతమంది స్టేషన్ ప్లాటుఫారం మీద అటూ ఇటూ తిరుగుతున్నారు. ఆడవాళ్ళంతా ఉన్నగది దగ్గరకు హడావడిగా వచ్చి చౌదరిగారు "ఏమర్రా అంతా వచ్చినట్లేనా? ఎవరైనా దిగబడి పోయారా?" అని అడిగారు. ఆ మాటలకు వారి భార్య "మేమంతా వచ్చినట్లే మీరు మీపెద్దబ్బాయి ఇంకా అక్కడే దిగబడి పోయారేమో అని చూస్తున్నా" అన్నది. "అయితే వాళ్ళు ఎక్కడికి వెళ్ళి నట్లూ? ఇంకా రాలేదా వాళ్ళు ?" అని అడిగారాయన.

"మీ విషయమేనా?"

"అబ్బా నా విషయంకాదే నేను వచ్చేశానుగా!"

"నిర్ధారణంగా వచ్చినట్లేనా" అని అంటూ ఆవిడ ఊరికే పగలబడి నవ్వేసింది. ఆమెతోపాటు మరికొందరు ఆడవాళ్లు నవ్వారు. "మీకంతా నవ్వుగా వుందే స్టేషనుకు ముందుగా వచ్చిన వాళ్ళు బండి ఎప్పుడొస్తున్నదో ఏమిటో కనుక్కోనైనా కనుక్కున్నారూ" అంటూ ఆయన బుకింగు కిటికీ దగ్గరకు వెళ్ళి ఆ విషయం వివరంగా అడిగి తెలుసుకొని, ఇవతలకు వస్తూ ఉండగా వారి పెద్దబ్బాయి భార్యనూ, పిల్లలనూ వెంట పెట్టుకొని ఎదురయ్యాడు. "ఏమిరా కేశవా ఇంత ఆలస్యం చేశావు?" అని పలకరించి "మరి త్వరగా టిక్కెట్లు కొందాం పద" అన్నారు చౌదరిగారు. వారు గబగబా అందర్నీ లెక్కపెట్టి నిండు టిక్కెట్లకూ, అర టిక్కెట్లకూ కలిపి ఎంత అవుతుందో కాగితంమీద లెక్కవ్రాసికొని కావలసిన పైకం పెట్టెలోంచి తీసుకొని, ఆ డబ్బు జేబులో పెట్టుకొని, పెట్టెకు తాళంవేసి తాళం ఒకటి రెండు సార్లు లాగిచూసి, ఆతాళం చిన్న బనీను జేబులో భద్రపరచుకొని, గబగబా బుకింగు గదిలోకి వెళ్ళారు. పది నిమిషాల తర్వాత తిరిగి వచ్చి టిక్కెట్లు పెట్టెలో పెట్టబోతుండగా వారి పెద్దబ్బాయి కేశవరావు "అని నాకివ్వండి. పెద్ద పెట్టెలో ఎందుకూ. మధ్యలో తనిఖీ జరిగితే ఆ పెట్టె తీయడం కష్టం అదీగాక ఆ పెట్టె అలా ఎక్కడబడితే అక్కడ తియ్యడం వెయ్యడం అంత మంచిదీకాదు." అని నచ్చచెప్పి వాటిని తాను అంది పుచ్చుకొని తన చిన్న సూట్ కేసులో పెట్టుకున్నాడు.

చౌదరిగారు కొంచెం సేపు పెట్టెమీద తాపీగా కూర్చుని అంతలో ఏదో ఆలోచన వచ్చి వేళ్లకు ఉన్న రెండు ఉంగరాలు, పైన వేసుకొన్న జరీ అంచు పట్టు ఉత్తరీయం తీసి పెట్టెలో వేసి మళ్లీ తాళం వేస్తూ ఉండగా, వారి పెద్ద కోడలు ఆయన దగ్గరకు వచ్చి మెళ్ళో ఉన్న గొలుసులూ అవీ తీసి పెట్టెలో వేయండి మామయ్యా. ఇంటికివెళ్ళాక తీసుకొంటాను" అన్నది "ఎందుకమ్మాయి- మెళ్ళో ఉండనీయరాదూ" అంటూ ఏదో సుర్పణకు.

వచ్చి "ఆ, ఆ, అదే మంచి పని ఇలాతే అని వాటేని అంది పుచ్చుకొన్నారు పెళ్ళికి వచ్చేటప్పుడు జరిగిన ఒక చిన్న సంఘటన ఆయనకు స్ఫురణకు వచ్చింది. తన పెద్ద కోడలు అక్క కూతురు నాగలక్ష్మి మెళ్లో గొలుసు పోయింది. పెళ్ళివారంతా బండి ఎక్కేటప్పు ఆ పిల్ల మెళ్లోనుండి ఎల్లా పోయిందో పోయింది. తీరా బండికదిలిన అయిదారు నిమిషాలకు కాబోలు వారి పెద్ద కోడలు "ఓ నాగలక్ష్మి నీ మెళ్లో గొలుసేదే" అని అడిగింది గొలుసేదంటే ఏదని వెతుక్కున్నది ఆ పిల్ల ఎంతో గాబరా పడ్డది. చివరకు ఏడుపు ముఖం పెట్టింది. మా అత్తయింటిలో ఈ సంగతి తెలిస్తే ఏమంటారో ఏమో అనుకొని మరీ భయపడ్డది. ఆ భయంతో అ పిల్ల గొడవ చేసింది. అప్పుడు చౌదరిగారు వెళ్ళి సంగతి విచారించి "పోన్లే అమ్మాయి నేను మళ్ళీ చేయించి ఇస్తాను. నువ్విప్పుడేం మాట్లాడకు--పోయిన వస్తువేమో పోనే పోయింది అది ఇంక దొరక్కపోగా అనవసరపు రభస అవుతుంది. నా మాట విను. మళ్ళీ మనం ఇంటికి చేరేదాకా దాని విషయం ఎత్తద్దు." అని చెప్పి కట్టుదిట్టం చేశారు ఆ విషయమే ఇందాక జ్ఞాపకం వచ్చింది.

"అప్పుడు పోయింది ఒక్క గొలుసు కనుక మళ్ళీ చేయిస్తాన్లే అని అనగలిగాడు. మరి ఇపుడు తిరుగు ప్రయాణంలో అర్ధరాత్రి కూడా దాటుతుంది తెనాలి చేరేసరికి. పైగా అక్కడ బండి ఎక్కువసేపు ఆగదు. ఎక్కే జనం దిగే జనం. అందులో తెనాలి స్టేషన్. ఎన్ని దొంగతనాలు, ఎన్నిసార్లు ఎంతమంది పర్సులు పోవడాలు. ఆయన ఆలోచనలో పడ్డారు. ఆలోచనలు వారిని భయపెట్టాయి. కొంచెం గాభరా పడ్డాడాయన, "ఏ కొంచెం ఆలస్యం జరిగినా అదంతా నామీదకి వస్తుంది. ఎవరిమెళ్లో ఏది పోయినా ఫలానా వారింటిలో పెళ్ళికి వెళ్ళాం ఆ వస్తువుపోయింది." అని చెప్పుకుంటారు. అది వాళ్ళ పొరపాటే అయినా, వాళ్ల అజాగ్రత్త అయినా అలా చెప్పుకొంటారు. మనస్సు కష్ట పెట్టుకుంటారు వాళ్ల వాళ్ళు పెళ్ళికి

వెళ్ళాం. నగపారేసుకొన్నావు" అని చివాట్లు పెడతారు. ఆ ఉసురు...." అని ఇలా చాలాదూరం ఆలోచించారాయన. కొంచెంసేపు తరువాత భయపెడుతున్న ఆలోచనలు ఇక భరించలేక "అమ్మాయి ఇలా రా అమ్మా" అని పెద్దకూతుర్ని పిలిచారు. ఆ పిల్ల వస్తూఉండగా తన భార్యకేసి చూచి "ఒసే నువ్వు ఇటు" అని భార్యను పెద్దగా పిలిచారు. వాళ్ళిద్దరూ వచ్చారు. "ఎందుకూ బండికి చాలా వ్యవధానం ఉందిగా, ఏమిటి ఆ గాభరా, ఎందుకు పిలిచినట్లు" అన్నది చౌదరిగారి భార్య. ఆయన "మీ మెళ్ళో నగలన్నీ తీసి ఈ పెద్ద పెట్టెలో వేయండి అదిగో వాళ్ళందరికీ కూడా చెప్పండి. ఎవరినగలు వాళ్ళ రుమాళ్ళలో కట్టి ఇందులో పడవేయండి. ఊఁ, త్వరగా కానివ్వండి. మొన్న వచ్చేటప్పుడు నాగలక్ష్మి గొలుసు - నాలుగు సవరనుల గొలుసు పోవటం చూశారుగా. అది మళ్ళీ నేను చేయించి ఇవ్వాలి ఇస్తాననుకో. ముందు వస్తువు పోయిందికదా - ఇప్పుడు మళ్ళీ బండి దిగేటప్పుడు రద్దీ అలాగే వుంటుంది. ముందు జాగ్రత్త పడటం మంచిది. ఇంతమందిని నేనెక్కడ కాపలా కాసేది. అప్పుడు ఒకటిగనక ఏదో చేయించి యిస్తానన్నాను...." అంటూ ఆయన మాట్లాడుతుంటే ఆ మాటలు విన్న కొందరు ఆయనచుట్టూ చేరారు. వాళ్ళు అక్కడ చేరడం చూచి మిగతావాళ్ళంతా "ఏమిటంటే ఏమి" టని ప్రశ్నలు వేశారు ఆయన అందరికి విషయమంతా వివరించి చెప్పారు. "ఇదే మంచిపని అంటే ఇదే మంచిపని" అన్నారు కొందరు. "అబ్బే ఎందుకూ మెళ్ళో ఉంటే ఎవరు తీస్తారు మరేం పరవాలేదు" అన్నారు మరికొందరు. వారు వీరు వాదించుకొన్నారు కొంతసేపు. వాళ్ళందరితో చౌదరిగారు నెమ్మదిగా "అది కాదర్రా - మీకల్లా వాదాలు పెట్టుకోకండి నాగలక్ష్మి గొలుసు పోయిందా ! అందుకు దానికి కష్టంగానే వుంది, నాకూ కష్టంగానే ఉంది. ఇంటికి చేరేదాకా నగలన్నీ పెట్టెలోవుంటే భద్రంగా వుంటాయని చెపుతున్నాను. మీరు బండిలో నిద్రపోవచ్చు. దిగేటప్పుడు నిద్రమత్తుగా

ఉండవచ్చు, ఎటుపోయి ఎటువచ్చినా ముందు జాగ్రత్త పడటం మంచిది" అన్నారు. వారి పెద్దమ్మాయి మెళ్లోవన్నీ తీసి, తల్లివికూడా అడిగి తీసుకొని తండ్రికిచ్చి మిగతావాళ్ళతో "మా నాయన భద్రం చేస్తానంటూంటే మీకేదో కష్టంగా వున్నట్లున్నది." అని తండ్రివైపు తిరిగి "వాళ్ళకుమాత్రం బాధ్యత తెలియదా, జాగ్రత్త తెలియదా, మీకెందుకు మీరు వూరుకోండి" అని చెప్పి తల్లితోపాటు అవతలికి వెళ్లింది. "మూడు నిద్రలై వాళ్లంతా ఎవరి యిళ్లకు వాళ్లు వెళ్ళేవరకు వారి బాధ్యతంతా తనదే" ననిపించింది ఆయనకు. ఆయన ఇంకా ఎవరెవరు ఇస్తారో అని చూస్తూ ఉండిపోయారు కొంతసేపు.

"అందరం ఒక్కపెట్టెలో ఎక్కమయ్యే. ఈ పెట్టెలూ, మూటలూ బండిలోకి చేర్చి పిల్లలను చంకన పెట్టుకొని రైలు ఎక్కడమే కష్టమయ్యే. ఎక్కేటప్పుడూ అంతే, దిగేటప్పుడు అంతే ఈ సందడిలో ఏమైనా జరగ వచ్చు. ఆయన పెద్దవారు అవన్నీ పెట్టెలో పెట్టి జాగ్రత్తపెడతానంటుంటే మధ్య మనకేం కష్టం" అనుకున్నారు కొందరు. వాళ్లు వెంటనే తమ తమ గొలుసులు, నెక్లేసులు తీసి రుమాళ్లలో మూటకట్టి వారిచేతి కిచ్చారు ఆయన ఎప్పటికప్పుడు వాటిని పెట్టెలో దాచారు. మరికొన్ని నిముషాల తరువాత మిగతావాళ్ళుకూడా "అందరూ ఇలా దాచుకొంటున్నప్పుడు మనం కూడా ఇవ్వకపోతే బాగుండదేమో ? అదీగాక ఖర్మంజాలక ఏమైనా జరిగినా చూచావా మరీ ఎంతపనైదో ? ముందుగా చెప్పినా విన్నారుకాదు. దొంగ మీద భరోసా ఉంచారుకాని ధర్మరాజులాంటి మనిషిని నమ్మకపోతిరి" అని నాలుగూ అంటారు అని భయపడి తమతమ నగలుకూడా తీసి ఇచ్చారు.

అందరూ అల్లా చేశాక చౌదరిగారికి మనస్సు స్థిమితపడ్డది.

"హమ్మయ్య ఇంక భయం లేదు" అనుకున్నా రాయన. పెట్టెకు రెండుప్రక్కలా రెండు గోడ్రెజు తాళాలు వేసి రెండు మూడు సార్లు లాగి చూచి తృప్తిపడ్డా రాయన. ఆయన తృప్తిగా ఆ పెట్టెవంక చూశారు.

అది చాలా గట్టి పెట్టె.

ఖాళీపెట్టె చచ్చేటంత బరువు. దాదాపు అర్ధ అంగుళం దళసరి ఇనుప రేకుతో చేసిన పెట్టె అది మధ్యగా ఉన్న మారుతాళం వేసినా చాలు. కాని అది చాలదని చౌదరిగారు ఆ పెట్టెకు రెండుప్రక్కలా తాళాలు వేశారు. "ఇంక బెంగలేదు" అనుకుంటూ ఆయన ఆ పెట్టెమీద కూర్చొని తాపీగా చుట్ట ముట్టించారు.

వారు ఆ చుట్ట పారవేయకముందే గంట కొట్టారు. వారి పెద్దబ్బాయి కేశవరావు అందర్నీ ప్లాటుఫారంమీదికి వెళ్ళమని తాను కూలీలను వెంట బెట్టుకొని వెళ్ళి సామానులవీ బండి ఆగేచోటుకు చేరాడు. ఇంతలో బండి వచ్చింది. పెళ్ళివారందర్నీ అక్కడక్కడా సర్ది కేశవరావు వచ్చి తోడుపడితే ఆ పెట్టె తీసుకొని చౌదరిగారు సెకండుక్లాసు పెట్టెలో ఎక్కారు. అక్కడ కూడా రద్దీగానే ఉంది. రెండు తలుపులకు మధ్య ఉండే జాగాలో ఆ పెట్టె మీదనే కూర్చున్నారు చౌదరిగారు. గార్డుఈల విసిపించాక కేశవరావు "మరి నేనిక అక్కడకు వెళతాను జాగ్రత్త" అని చెప్పి వెళ్ళాడు. వారు బండి కదిలాక వెనక్కు వాలి చెక్కగోడకు వీపు ఆనించి కాళ్ళుచాపుకొని విశ్రాంతిగా కూర్చున్నారు. మరో అయిదు నిమిషాల తరువాత ఆయన మళ్ళీ చుట్ట వెలిగించారు. అనుకోకుండానే ఏదో ఆలోచనలో పడి – నాగలక్ష్మి గొలుసు విషయం జ్ఞాపకం తెచ్చుకొని "దాన్ని మరి రెండు రోజులు వుంచి ఆ గొలుసు చేయించి యిచ్చి మరీ పంపాలి. లేకపోతే పసిదానిని వాళ్ళు ఎన్ని అంటారో ! ఎంత రభస అవుతుందో ఏమో !" అనుకున్నా రాయన. ఆ ఆలోచన తప్పించాలని,

"పెళ్ళి అనుకున్నదానికంటే ఎక్కువ ఘనంగానే జరిగింది సుమా!" అని పెద్దగా అనుకొని, ఆ విషయం ఆలోచించడం మొదలుపెట్టారు. కానీ అంతలో మళ్ళీ నగల విషయమే ఆలోచనలకు వచ్చింది.

"ఇంతమందినీ ఎల్లాగో ఒప్పించి, యివి భద్రం చేయగలిగాను కనుక, సరిపోయింది. లేకపోతే ఏ యిబ్బంది వచ్చేదో సుమా! మంచి పని చేశాను. ఇంకేమీ భయంలేదు." అని గట్టిగా అనుకుని కళ్ళుమూసుకునే చుట్ట కాల్చటం మొదలుపెట్టారు. చుట్ట పూర్తి కాకుండానే దూరంగా పారేశారాయన. అబ్బ! ఇంత బడలికగా ఉందేమిటి? అనుకుంటూ కళ్ళుమూసుకుని కూర్చున్నారు. అనుకోకుండానే వారికి మరో పదినిముషాలలో మంచి నిద్ర పట్టింది.

అర్ధగంట తరువాత ఆయనకు మెలకువ వచ్చింది. చప్పున చేత్తో పెట్టెను తడిమిచూచుకొన్నారు. "దీనిమీదే కూర్చుని వున్నా కూడా తడిమి చూస్తున్నానేమిటి, ఏమిటో చాదస్తం. అంటే ఇదే కాబోలు" అనుకొని నవ్వుకొన్నారు. నిద్ర పోకూడదు. వాళ్ళందరి సొమ్ములూ ఇందులో వున్నాయా, ఎంత లేదన్నా యాభై, అరవై వేలు ఖరీదు చేస్తాయి. ఇంత విలువైన సొమ్ము దగ్గర పెట్టుకొని ఇలా ఒంటరిగా ప్రయాణం చేయడమే తప్పు. వాళ్ళతోబాటే ఉండవలసింది. పోనీ నా దగ్గర ఉంచుకోవలసింది. రైళ్ళలో దొంగతనాలు అవీ మహాచిత్రంగా జరుగుతూ ఉంటాయట. పెట్టెలు మారుస్తారట ఇలా అనుకుంటూ ఆయన ఓ సారి లేచి నిల్చుని కళ్ళు నలుపుకొని మళ్ళీ కూర్చున్నారు "ఏమైనా నిద్ర పోకూడదు అనుకుంటూనే. ఆయన పూర్వంలా కూర్చునే మంచి నిద్రపోయారు. మరీ నిద్ర ముంచుకొస్తున్న చివరి క్షణాల్లో, "అబ్బె మరేం భయంలేదు. ఓ కునుకు తీస్తే" సర్ది చెప్పుకున్నాడు ఆ తర్వాత ఆయనకు ఇంటిలో పట్టెమంచంమీద మంచి దూది పరుపు వేసుకొని పడుకొన్నప్పటికంటె ఎక్కువ సుఖంగా నిద్ర పట్టింది. బండి బాపట్లలో ఆగిన సంగతికానీ, మామూలుగా ఎక్స్ప్రెస్సూ, మెయిలూ ఆగని ఎడ్లవాడు దగ్గర దాదాపు గంటదాకా బండి ఎవరికీ తెలియని కారణాన్ని పురస్కరించుకొని ఆగిన సంగతి కానీ, ఆయనకు తెలియదు.

ఇంతలో తెనాలి స్టేషన్ వచ్చింది. పెళ్ళివారంతా కోలాహలంగా బండి దిగారు వాళ్ళను త్రోసుకుంటూ ఎక్కేవాళ్ళు వాళ్ళను ఓ పట్టాన దిగనీయలేదు. ఎక్కేటప్పుడులాగే మొగవాళ్ళు కొంతమంది క్రిందమరికొంత మంది పెట్టెల్లోనూ ఉండిన సామాన్లన్నీ క్రిందకు దింపారు. సామాన్లన్నీ మూడు నాలుగుచోట్ల కుప్పలుగా వేశారు. వాటిదగ్గర అక్కడ కొంతమంది అక్కడ కొంతమంది నిలబడ్డారు పిల్లలు ఈ హడావిడికీ, ఒత్తిడికీ నిద్రలులేచి "కీ" "బా" అని ఏడ్పులు మొదలుపెట్టారు. సామాన్లు బయటకు "మేంతెస్తామంటే మేంతెస్తామని కూలీలు ఎగబడ్డారు. వాళ్ళను గదమాయించి దూరంగా నిలబెట్టారు. కొంతమంటి బండి కదలడానికి మరో నిముషమైనా ఉన్నదో లేదో అప్పుడుగాని చౌదరిగారి విషయం ఎవరికీ జ్ఞాపకం రాలేదు. వారి భార్య పెద్ద కొడుకును పిల్చి "నువ్వు త్వరగా వెళ్ళి ఆయన్ను దింపు-ఆ పెట్టి జాగ్రత్త.." అ టూ అతన్ని పురమాయించింది. అతను చప్పున రెండవతరగతిపెట్టెలవైపుపరుగెత్తి ఒకటి రెండు పెట్టెలలోకి తొంగిచూచి, విసుక్కొని, గాభరాపడి, చివరకు ఆయన ఉన్న పెట్టెలోకి జొరబడి, వారిని నిద్రలేపి క్రిందకు దింపి, పెట్టెలో ఉన్న వాళ్ళ సహాయంతో ఆ ట్రంకు పెట్టె ప్లాటు ఫారంమీదకు చేర్చాడు. తండ్రీకొడుకూ ఇవతలగా నిలబడ్డారు. "మీరు మేలుకొనే వుంటారు కదా అనుకొన్నాము" అని కేశవరావు అంటూ ఉండగా రైలు కూతవేసి కదిలిపోయింది. వీళ్ళు సరిగా దిగారో, లేదో అని భయపడుతూ రొప్పుతూ రొప్పుతూ అక్కడికి వచ్చింది చౌదరిగారి భార్య. ఆవిడతోపాటు మరోనలుగురు ఆడవాళ్ళు కూడా వచ్చారు. "ఏరా అబ్బాయి, ఇంతకీ ఆ పెట్టె కిందకు దింపారా లేదా అని ఆత్రంగా అడిగింది "దింపాన్లే. నువ్వూరికే గాబరాపడకు" అని విసుక్కున్నారు చౌదరిగారు.

"ఏదండీ దింపానంటారు అంటూ అటూ ఇటూ చూచింది. కేశవరావు ఇక్కడ వుందిలేవే అమ్మా అయినా ఎందుకంత గాబరా పడతావు అన్నాడు "ఆయనేమో పగం పెట్టి దగ్గరపెట్టుకొని నిద్ర తీస్తే బాగానే ఉన్నదీ. అందరూ దిగిన గంటకు కూడా దొరగారు బండి దిక్క-పోవడం బాగుంది. అదేమిరా అంటే నేనేమో గాబరా పడుతున్నానంటావు. బాగుంది నీ వరుస" అంటూ ఆవిడ విసురుగా మాట్లాడేస్తుంటే చౌదరిగారు ఒళ్ళు విరుచుకొని, కళ్ళు నలుపుకొని, నిద్రమత్తూ పోగొట్టుకొన్నారు. వారి పెద్దమ్మాయి ముందుకు వెళ్లి వారి వెనకాలగా ఉన్న ఆ నగలపెట్టెమీద కూర్చుంటూ "ఒరే అన్నయ్యా నువ్వు వెళ్లి ఆ కూలీలతో మాట్లాడి త్వరగా ఇంటికి చేరే ఉపాయం చూడు. అన్నది. అతను అటు వెళ్లాడు చౌదరిగారు కాస్త నింపాదిగా మాట్లాడుతూ "అయినా దేనికి అంత హడావిడి పడతావు. నేనేమి వెర్రిబాగులవాడననుకొన్నావా" అన్నారు. ఆ మాటకి వారి అమ్మాయి "పోనియ్యండి నాన్నగారూ. ఇంక ఆ విషయం వదిలివేయండి. నగలన్నీ ఉన్న పెట్టె గనుక సరిగా దించారో లేదో అని గాభరాపడ్డది. నిజానికి అన్నయ్య పరిగెత్తుకొనిరాకపోతే ఏమయ్యేది?" అని అడిగింది.

"ఏమయ్యేది ఆయనగారు అలా నిద్రపోతూ ఉండేవారు—" అని మళ్ళీసాధింపు మొదలుపెట్టిన భార్యను కొంచెం గదమాయిస్తూ "అంత ప్రమాదం ఏమీలేదు. బెజవాడలో దిగి రేపు ప్రొద్దున వచ్చేవాణ్ణి...." అన్నారు చౌదరిగారు నవ్వుతూ, "అవున్లెండి రారనికాదు. ఈలోపల మేమెంత భయపడి పొయ్యేవాళ్లమో అది మీకేమైనా తెలుస్తుందా ఏమన్నానా అయినా మీతో మాట్లాడి లాభంలేదు" అంటూ ఆవిడ మిగతావాళ్లు నిలబడిన చోటుకు వెళ్లింది. మరో పదినిముషాలకు సామాన్లన్నీ లైసెన్సు కూలీలు తలలపై ఎత్తుకొని ముందు నడుస్తూంటే పెళ్ళివారు వెనుక నడిచారు. గేటు

దగ్గర టిక్కెట్లన్నీ ఇచ్చి కొంచెం ముందుకు వెళ్లిన కూలీలను కలుసుకొన్నాడు కేశవరావు. మిగతా వాళ్లంతా ఇంకా నిద్రమత్తుగానే నడుస్తున్నారు. టికెట్టు వసూలుచేసుకునే గేటుదగ్గర కొందరు ఆడవాళ్ళు "ఏమర్రా ఆ నగల పెట్టి భద్రంగా ఉందా" అని ఒకరిద్దరు అడిగితే చౌదరిగారు కల్పించుకొని ఊరికేఅరవకండర్రా" పదండి త్వరగా అన్నారు. గేటు దాటాక మొగవాళ్ళందరూ అడ్డదార్ని నడక సాగించండి" అన్నారు చౌదరిగారు. బయటకు వచ్చేసరికి బయట రేకుల షెడ్డులో సామాన్లు దింపి కూలీలు నిలబడ్డారు. వారికి దగ్గరగా కేశవరావు నిలబడి ఉన్నాడు. ఆడవాళ్లంతా వచ్చాక "మీరంతావెళ్ళి మన ఎద్దుబళ్ళలలో ఎక్కండి" అన్నాడతను. చౌదరిగారు ముందుకువచ్చి "అబ్బాయిసామాన్లన్నీ వచ్చాయో లేదో ఓసారి చూచుకొని వాళ్ళకు కూలీ ఇచ్చి పంపు. నీ దగ్గర డబ్బు ఉందా నేనివ్వనా" అని అడిగారు. అక్కర్లేదులెండినా దగ్గరుంది" అంటూ అతను ట్రంకులన్నీ లెక్కపెట్టటం మొదలుపెట్టాడు చౌదరిగారి భార్య "ఇన్ని సామాన్లు లెక్క చూడడం కష్టంగా అంతా ఇక్కడే ఉన్నాంకదా ఎవరి పెట్టెలూ, పరుపు చుట్టలూ వచ్చాయో లేదో వాళ్లే చూసుకొంటే సరి అంటూనే, లెక్కపెట్టడం మధ్యలో ఆపి పెట్టెలన్నీ ఇక్కడి వక్కడకూ అక్కడివిక్కడకూ లాగుతూ, మళ్లీ లెక్క మొదలుపెడుతూ గాభరా పడుతున్న పెద్ద కొడుకును చూచి "ఏమిట్రా ఏమైనా తక్కువయ్యాయా అని ఒక్కక్షణం కలియ జూచింది "వాటి సంగతికేంలే పెద్ద పెట్టి అసల్ది వచ్చిందా ఏదదీ" అంటూ ఆవిడ గాభరాగా పెట్టెలన్నిటివంకా మళ్లామళ్లా చూచింది. వాళ్ళ గాభరా చూచి చౌదరిగారు కూడా ఆదుర్దా పడుతూ "ఏమిటా అరె" అంటూ గబగబా సామాన్ల చుట్టూ తిరిగారు ఇంకేముంది. పెట్టె కాస్తా పోయింది." అని గుండె కొట్టుకొంది వారి భార్య. "అబ్బ ఊరికే హడలకొట్టకే" అంటూనే అంతలో అదృశ్యమై పోయినపెట్టె విషయం తల్చుకొని ఆయన హడలి

పోయ్యారు. కేశవరావు తన తమ్ముణ్ణి పిల్చి నువ్వు "ప్లాటుఫారం మీదకోసారి వెళ్లితారా దాన్ని వాడింకా తేలేదేమో?" అన్నాడు. ఆపెట్టె బరువు కావడాన్న దాన్ని మోసుకొస్తున్న మనిషి కొంచెం వెనుకబడ్డాడేమో అని తాము వచ్చినవైపే చూస్తూ ఉండిపోయాడతను. చౌదరిగారికి గూడా అదే అనుమానం కల్గింది. వారు అటే చూస్తూ నిలబడ్డారు. మరో రెండు నిముషాలకు వెళ్లిన మనిషి వచ్చి "అక్కడ ఎవ్వరూ లేరన్రా పెట్టెతెస్తున్న కూలీ ఎవరూ కనపడలేదు" అని చెప్పేసరికి" అమ్మనాయనో అది పోనే పోయిందిరా" అంటూ చౌదరిగారి భార్య కుప్పగూలిపోయింది. చౌదరిగారు ఒక్కక్షణం స్తంభించిపోయారు. "పోవడం యేమిట్రా అంత పెద్దట్రంకు ఎలా పోతుంది? నువ్వోసారి అల్లా వెళ్లిచూచిరా" అనిచెప్పి కేశవరావునుపంపించారు. అతన్ని అటు పంపించి భార్యదగ్గరకు వెళ్లారాయన. ఆవిడకు స్పృహలేదు. పెళ్లివార్ని కొందర్ని తొందరపెట్టి చిన్నకొడుకునూ, పెద్దకోడల్ని వెంట ఉండమని ఒకబండి కట్టించి వాళ్లను ఇంటికిపంపారు. వారికాపెట్టె పోయిందనే నమ్మకం ఏకొంచెంకూడా కల్గలేదు. మరికొంత సేపటికి కేశవరావు తిరిగి వచ్చాడు. "మొత్తంమీద అది కన్పించలేదు." అని తండ్రితో అని కిక్కురు మనకుండా నిలబడ్డ కూలీల దగ్గరగా వెళ్లి "ఏమర్రా పెట్టెలన్నీ తెచ్చింది మీరు, మీకు తెలియకుండా ఒకపెట్టె ఎలా మాయమవుతుంది? అని గదమాయించి అడిగారు. వాళ్లు "మాకదేమీ తెలియదు. మీరు నెత్తికెత్తిన సామాన్లు తెచ్చాం. ఇక్కడ దింపాం. మాకూలీ ఇప్పించండి మేం పోతాం" అన్నారు.

"పోతారేం?" అంటూ చౌదరిగారు ముందుకు వచ్చారు. మీరు వూరుకోండి అని ఆయన్ను వారించి ఆ రేకుల షెడ్డులో ఆపెట్టె మరే మూలనైనా దింపారేమోనని అంతా తిరిగి చూచాడతను. ఎక్కడా కన్పడలేదా పెట్టె. అతను ఒక నిర్ధారణకు వచ్చేశాడు వెంటనే "ఉండండి వస్తాను...."

అని అవతలకు వెళ్లి బయట కిరాయి బళ్ల వాళ్ళతో బేరమాడుతున్న బంధువులతో "మీరంతా ఇంటికి చేరండి. ఇప్పటికే పొద్దుపోయింది. అదెక్కడికి పోదు. నేతెస్తా" అని చెప్పి వాళ్లను ఒప్పించాడు. మిగతా సామాన్లన్నీ బళ్ళల్లోకి ఎక్కించారు. ఆ బళ్లు కదలి వెళ్ళి పోయాయి.

అతను చకచకా వెనక్కువచ్చి కూలీలను మళ్ళా మళ్ళా మంచిగా అడిగాడు. వాళ్ళు ఏంపెట్టో ఏమిటో మాకు తెలియదన్నారు. అతను గదమాయించాడు. కొట్టబోయాడు. కాని ప్రయోజనం లేకపోయింది. చివరకు ఆ నలుగురిని వెంటపెట్టుకొని రైల్వేపోలీసు స్టేషనుకు తీసుకెళ్ళాడు. వాళ్ళవెంట చౌదరిగారు యాంత్రికంగా నడిచారు. ఆయనకు ఇప్పటికి చాలాసేపటినుంచి తల తిరుగుతోంది మతిపోతున్నదా అనిపించింది. కాని ఆయన ఎంతో ప్రయత్నంమీద సంబాళించుకొన్నారు: పైగా అది పోయిందనే నమ్మకం కలగనేలేదు. "ఎట్లా పోతుంది. ఇంత మంది మనుష్యులు వెంటవుంటే అది ఎత్తుకొని తప్పించుకోవడానికి ఎవరికి సాధ్యమవుతుంది? అని ఇంకా ప్రశ్నించుకుంటూనే ఉన్నాడాయన అది పోయిందనే విషయం నమ్మడానికి ఆయనకు మనస్కరించటంలేదు. జరిగిన వాస్తవాన్ని వాస్తవంగా గుర్తించడానికి ఆయనకు ధైర్యం చాలలేదు. చాలా సేపటి వరకూ పోలీసు స్టేషనులో ఇనస్పెక్టరు ముందు చౌదరిగారు ఏమీ మాట్లాడలేకపోయినారు. ఆయన ఎందుచేతనో మౌనం వహించారు. కుర్చీలో ఎంతో నిస్త్రాణగా కూర్చున్నారు. ఎదురుగా ఉన్న బల్లమీద చేతులుపెట్టి చేతుల్లో ముఖం దాచేసుకున్నారు. ఆయనకు తలతిరగడం క్రమంగా ఎక్కువ అయింది.

ఆయనకు తానేదో మహాప్రవాహంలో పడి కొట్టుకొనిపోతున్నట్లుగా అనిపించింది. వచ్చిన ఆలోచనలే మళ్లామళ్లా వస్తున్నాయి దాదాపు యాభై వేల రూపాయల నగలు. ఒక్కళ్ళవికాదు నలుగురివీ–అందుతో పెళ్ళికి

వచ్చిన బంధువులని, శుభమా అంటూ పెళ్లికి వస్తే ఇంతపని జరగడమా! వీళ్ళందరికీ నేను ఏమని సమాధానం చెప్పడం. ఎవరివస్తువు వాళ్లదగ్గరే ఉంటే-నేను ఉండనిస్తే బాగుండేదేమో-వాళ్ళదగ్గర కంటె నాదగ్గర ఉంటే మంచిదని, నాజాగ్రత్తలో వుంచుకుందామని ఇలా చేశాను

ఇప్పుడు ఏమని సమాధానం చెప్పకోవాలి. పోయింది నన్ను ఏం చెయ్యమంటారు అని వూరుకోవటం ఎల్లా సాధ్యం? వాళ్ళంతా ఏమనుకొంటారు? పెద్ద తనే మహా జాగ్రత్త పెట్టే మనిషిలా అందరి మెళ్లల్లోంచి తీయించాడు. పెద్దమనిషిఅనిఅనరూ- అంతటితో వూరుకొంటారా- వీళ్ళకు మళ్ళా చేయించి, ఇవ్వడం సాధ్యపడుతుందా-ఇందులో నాతప్పేమీ లేదని వాళ్ళకు తెలియదా? ఆపెట్టె నిజంగా పోయిందా ఇదికాక--కాక ఏమిటి? ఏవిటేముంది పెట్టె పోయింది. అదే ఎల్లా పోయిందీ అని వీళ్ళు ఎప్పుడూ స్టేషనులో ఉండే కూలీలు గదా వీళ్ళు ఇలా చేస్తారా? వీళ్ళను నమ్మడానికి వీల్లేదు?-అరె ఎందుకిల్లా జరిగింది-పైగా ఇంతమంది వెంట ఉండగానా? వీళ్లలో ఎవరు చేశారీ పని? ఎప్పుడు చేశారీ పని? ఆయన ఏమిటో ఆలోచిస్తున్నారు. తన్ను తాను ఎన్నో విధాల ప్రశ్నించుకొంటున్నారు. ఒక ఆలోచన వెంట మరో ఆలోచన. ఒక ప్రశ్న వెంట మరో ప్రశ్న వస్తూనే ఉన్నాయి.

ఒక్క ఆలోచనకూ అంతు అంటూ కన్పడలేదు.

ఒక్క ప్రశ్నకూ సమాధానమంటూ లభించలేదు.

ప్రతి ఆలోచనా ఒక బాగులా వస్తున్నది.

ప్రతి ప్రశ్న ఒక బాకులా తాకుతున్నది.

ఆయన తట్టుకోలేక పోయారు. చెప్పలేని బాధ అనిపించింది ఆయనకు. ప్రవాహంలో కొట్టుకొని పోతున్న మనిషి కొంతదూరం పోయి తల ఎత్తి

ఏదైనా ఆధారం దొరుకుతుందేమోనని చూచినట్లు ఆయన కొంతసేపటికి కళ్ళు తెరచి అందరివంకా ఆశగా చూశారు.

కేశవరావు ఇనస్పెక్టరుకు జరిగినదంతా వివరంగా చెబుతున్నాడు. ఆయన శ్రద్ధగా వింటున్నాడు. అంతా వివరంగా చెప్పి అతను చివరకు "ఇది ఖచ్చితంగా వీళ్ళు చేసిన పనే. మరొకరికి సాధ్యమయ్యేపనికాదిది. అసలు మరోమనిషికి ఇందులో ప్రమేయమేలేదు. దొంగలెవరో మీకు చెప్పాను. ఇంక మావస్తువు మాకు అప్పజెప్పే బాధ్యత మీది" అన్నాడు కేశవరావు. అందుకా ఇనస్పెక్టరు "అవునండీ మీ అనుమానం చాలా సహేతుకంగా ఉంది. అందులో నాక్కూడా సందేహం లేదు" అని ఇనస్పెక్టరు కూలీలవైపు తిరిగి కోపంగా చూస్తూ "ఏమర్రా అవునా ఏమంటారు.... ఇది మీపనేనా...." అని అడిగారు. వాళ్ళు "మాకేమీ తెలియదండీ-అన్యాయంగా మానెత్తిమీదకు నెడుతున్నారు. ఆ పెట్టె విషయం మాకు తెలియదండీ" అని పూర్వం చెప్పినట్లుగానే మళ్ళీ సమాధానం చెప్పారు.

చౌదరిగారు నిలబడి గట్టిగా అరుస్తూ "మీకు తెలియదనే అంటారా?" అని అడిగారు. వాళ్ళు "మాకు తెలియదండీ-ఎన్నిసార్లు చెప్పమంటారు" అని ఎదురు ప్రశ్న వేశారు. చౌదరిగారికి అంతలో కోపం వచ్చింది. ఆరావడం సాధారణంగా రాలేదు. తాటి ప్రమాణాన్ని వచ్చింది.

ఆయన సాధారణంగా కోపగించుకునే మనిషికాదు. ఇంటిలో మనుష్యులనేకాదు, చివరకు పాలేళ్ళనుకూడా ఎన్ని తప్పులు చేసినా చూచీ చూడనట్లుగా పోతూ కోపగించుకోకుండా, మరీ ఏదో అంత అవాంతరం వచ్చినప్పుడు మందలించేవారు. నిదానమైన మనిషాయన. ఆయన ఆరు అడుగుల ఎత్తయిన మనిషి. మొదటినుంచీ మంచి తిండిపుష్టిగల మనిషి

కావడంచేత, పదేళ్ళనుండీ ఉన్న పొలం అంతా సొంతంగానే సేద్యం చేస్తూ కష్టపడి పనిచేస్తూండడంచేతా, అయన శరీరం నల్లరాయిలా తయారయ్యింది.

అటువంటి శరీర దార్ఢ్యం ఉన్నా ఆయన ఎన్నడూ ఎవరిమీదా చేయి చేసుకోలేదు. అంతకోపం ఎన్నడూ రాలేదాయనకు. అటువంటి ది ఆకూలీలు మాకు తెలియదంటే, తెలియదని పైగా ఎన్నిసార్లు చెప్పమంటారని ఎదురు ప్రశ్న వేసేసరికి ఆయనకు ఎక్కడలేని కోపం వచ్చింది. కోపంతో వణికిపోయారాయన. "మీకేం తెలియదేం?" అంటూనే చౌదరిగారు వాళ్ళమీద విరుచుకుపడ్డారు. కన్నులు మూసి తెరిచేలోపల ఆ గదిలో ఇనస్పెక్టరుగారి బల్లకు నాలుగు అడుగుల దూరంలో వో కూలీ వెల్లకిలా బడ్డాడు. మరోకడు నేల కరుచుకున్నాడు. ఇంతలో కేశవరావు, అయనకూ, వాళ్ళకూ మధ్యగా వెళ్లి వారి రెండుచేతులూ పట్టుకొని "నాన్నా మీరు ఇక్కడ వాళ్ళమీద చేయిచేసుకోగూడదు తప్పు" అంటూ వారిని బలవంతాన వారించి తీసుకొనివచ్చి కుర్చీలో కూర్చోపెట్టాడు. అతను అల్లావారించి వుండకపోతే ఆ నలుగుర్నీ అస్పటల్‌లో చేర్చవలసి వచ్చేది. నలుగురూ కాకపోయినా ఒకరిద్దరయినా హరీమనేవాళ్లే. ఆయన బలం అటువంటిది. ఆ అడ్డుపడింది కేశవరావు కనక సరిపోయింది. మరొకరయితే నెట్టి అవతలకు విసిరేసే వారే. అసలాయన చెయ్యెత్తితేనే చాలు.

ఒకసారి గ్రామంలో పొలంగట్టు తగాదాలు వచ్చాయి. క్రోధాలు పెరిగాయి. అవతలివాళ్లు దౌర్జన్యానికి పూనుకొన్నారు. కాని అక్కడికక్కడ వారి ఎదుటపడే ధైర్యంలేక వాళ్ళు ఇద్దరు ఎద్దులాంటి మనుషుల్ని దుడ్డు కర్రలు ఇచ్చి రాత్రిపూట పొలంనుండి తిరిగి వచ్చేటప్పుడు ఆయన్ను అటకాయించమని పంపారు. చౌదరిగారు కాలవగట్టుదాకా వచ్చేవరకూ వాళ్ళు ఆయన వెనకే నడిచారు. బల్లకట్టు మరో యాభై గజాల దూరం

ఉందనగా వాళ్ళు ఆయన్ను అటకాయించాలని దగ్గరకు వెళ్లారు. ఆయన వెనక్కి తిరిగి చూచారు. చూచీ చూడటంతోనే వాళ్ళసంగతి పసికట్టారు. "ఎవడ్రావాడు" అంటూనే వాళ్ళు చెయ్యెకదపకముందే వాళ్ళమీదపడి అందులో ఒకణ్ణిఅమాంతం ఎత్తి కాలువలోకి విసిరి వేశారు. అది చూచి మిగతావాళ్ళు కర్రలన్నీ అక్కడ పడేసి మళ్లామళ్లా వెనక్కంటూ తిరిగి చూడకుండా రెండుమైళ్ళు లాకులదాకా పరుగెత్తారు.

ఆయన ధైర్యాన్ని చూచి జనం అంత భయపడేవాళ్లు. కాని అంతబలం వున్నదికదా అని ఆయన ఎవరిమీదకూ చీటికీ మాటికీ తగూకి వెళ్లేవారుకాదు.

పైకి ఎంత కిరుగ్గా కన్పిస్తారో ఆయన లోపల అంతమెత్తన. ఆయన హృదయం విశాలమైంది. పెద్ద వ్యవహర్తలు కానీ, పెద్ద చదువుకొన్నవారు కానీ కాకపోయినా ఆయనకు మంచి పలుకుబడి ఉన్నది. ఆయనకు ఉన్న ఆస్తి యాభై వేలు చేస్తుందో చెయ్యదో తెలియదు. కాని ఆయనమాటకు మాత్రం లక్షరూపాయల విలువవున్నది ఆచుట్టుపట్ల. అటువంటి మనిషాయన. రాకరాక వచ్చిందాకోపం. సొమ్ము పోయిందనేకాదు. సొమ్ముకంటె ప్రధానమైన పరువు పోయిందే అని. వీటి అన్నిటికంటె ముఖ్యంగా ఇంతమంది ఆడకూతుళ్ళను బాధపెట్టారే అని కష్టపడ్డాడాయన బాధ పరితప్తమైన హృదయంలోనుండి వెలువడింది ఆకోపం. అంతేగాని పోలీసుస్టేషనులో వాళ్ళను కొట్టడం తప్పని తెలియకకాదు. వాళ్ళే ఆపని చేశారని ఒకవంక నిర్ధారణంగా తెలుస్తున్నప్పటికీ మరొకవంక వాళ్ళలో ఈ పని చేసింది ఎవరో నిష్కర్షగా తెలియందే న్యాయశాస్త్రరీత్యా వారిని దండించే అధికారం కానీ, అవకాశంకానీ, తనకు లేదనే విషయం తెలియకనూ కాదు. కేశవతావు అడ్డుపడి ఆయన్ను బలవంతంగానయినా శాంతింపచేశాడు. కనుక సరిపోయింది. లేకపోతే అసలువిషయం పోయి మరో నేరంపై కేసు నడిచేదే.

* * * * *

వారు కొంచెం శాంతించాక ఇనస్పెక్టరు ఆ విషయం కదిపి కేశవరావుతో "ఏమండీ సరిగ్గా ఆ పెట్టె మోసుకొచ్చిన కూలీని మీరు గుర్తు పట్టగలరా?" అని అడిగారు. అతను కొంచెంసేపు ఆలోచించి "లేదండి నేను మొఖం చూడలేదు" అన్నాడు, "అయినా ఒకసారి ప్రయత్నం చేద్దాంరండి" అని ఇనస్పెక్టరు. అతన్ని వెంట పెట్టుకొని ప్లాటుఫారం మీదకు తీసుకొని వెళ్ళి కూలీలందరినీ పిలిపించి చూపించాడు. అతను ఎవరినీ గుర్తుపట్టలేక పోయ్యాడు ఆయన స్టేషను నాలుగుమూలలకూ కానిస్టేబుళ్ళను పంపి వెదికించాడు. ఒకవేళ ఎక్కడన్నా మూల దాచారేమోనని కొంతమందిని బయటకు పరుగులు పెట్టించాడు. కానీ ఏమీ ప్రయోజనం లేకపోయింది.

"ఈ వ్యవహారం నాకూ చాలా విచిత్రంగానే ఉన్నది. ఇది వెంటనే నిముషాలలో తేలే విషయంకాదు. ఇకమీరు వెళ్ళండి. నేను శ్రద్ధగా పనిచేసి మీకేసు పరిష్కారం చేస్తాను. నేను ఈక్షణం నుండే దర్యాప్తు మొదలు పెడతాను. ఆ పెట్టె ఈపాటికి బయటకు చేరిపోయి వుండవచ్చు. ముందు నేనన్నిచోట్లకు ఫోను చేస్తాను. ఇక ఆ విషయం సమస్తమైన ఏర్పాట్లు నేను చేస్తాలెండి-మీరు మీనాన్నగార్ని ఇంటికి తీసుకొని వెళ్ళండి. జాగ్రత్తగా ఇంటికి చేర్చండి-వారు చాలా ఆయాసపడుతున్నారు." అంటూ ఆయన వాళ్లు వెళ్లడానికి కావలసిన ఏర్పాటు చేశాడు. వారు జీపులో ఎక్కి, కూర్చున్న తరువాత ఇనస్పెక్టరు కేశవరావుతో మీరు రేపు ఉదయం ఒకసారి రండి-వివరంగా రిపోర్టు వ్రాద్దాం" అన్నారు. "అల్లాగే వస్తానండీ, వాళ్ళకు అది నగలపెట్టె అని ఎల్లా తెలిసిందో అని నాకు ఆశ్చర్యంగా ఉన్నదండీ, ఎట్లా తెలిసిందంటారు?" అని అడిగాడు కేశవరావు అదేమంత కష్టమండి, మీరుచేసిన పొరపాటు కూడా అక్కడే ఉన్నది. అది నలుగురికీ నగలపెట్టెఅని తెలిసేలా ప్రవర్తించడమే-పైగా మీ ఆకవాళ్లు నగలపెట్టె

డించారా? అది జాగ్రత్త, అది జాగ్రత్త అని అంటూనే ఉన్నారని కదూ మీరు ఇందాక చెప్పారు" అదే అదొక్కటే మీపొరపాటు. నిజానికి అదో పెద్దపొరపాటు కాదు, కాని అదే వాళ్లకు ఆధారం అయ్యింది. అల్లాకాక మరో అవకాశంకూడా ఉన్నది. మీరు బయలుదేరిన స్టేషనునుంచికూడా మీవెంట—అవన్నీ ఉన్నాయిలెండి సరే మీరు వెళ్ళండి" అని ఆయన తిరిగి స్టేషను లోపలకు వెళ్ళిపోయాడు.

తూర్పు తెలతెలవారుతుండగా వాళ్ళిద్దరూ ఇంటికి చేరారు. దారిలో చౌదరిగార్ని ఏదో సంభాషణలోదింపి "ఏరేం భయంలేదు పెట్టె దొరుకుతుంది. వాళ్లు ఒకవేళ పెట్టె పగులగొట్టినా నగలు ఎక్కడైనా అమ్మచూపుతారు. కదా అప్పుడైనా పట్టుకోవచ్చు. అల్లా దొరుకుతున్న సందర్భాలు మనం ఎన్ని వినడంలేదు" అని వారికి ధైర్యం చెప్పాలని ఎంతో ప్రయత్నం చేశాడు కేశవరావు కాని ఆయనకు అతని మాటలమీద ఎటువంటి నమ్మకం కలుగలేదు. వారు దారిపొడుగునా మౌనం వహించారు.

ఒక్కసారిమాత్రం "ఇంకా ఎందుకురా ఆ గొడవంతా. పోయిన సొమ్మేదో పోనేపోయింది. ఎక్కడైనా పోయినసొమ్ము దొరుకుతుందా?" అని మాత్రమే అన్నారు. ఆయన ఇంటికి చేరేసరికి దాదాపు ఒళ్లు తెలియని స్థితి ఏర్పడింది. "తల తిరుగుతున్నదిరా అబ్బాయి" అన్నారాయన గుమ్మంలో అడుగు పెడుతూ. అతను వారిని జాగ్రత్తగా నడిపించుకొని మంచం దగ్గరకు తీసుకొనివెళ్ళి "కాసేపు పడుకోండి. మరేమీ ఆలోచించకండి" అన్నాడు. ఆయన మంచం దగ్గరకు నడిచి నడుము వాల్చారు. ఆ వాల్చడం వాల్చడం ఆయన రెండు మూడు రోజులదాకా నడుం ఎత్తలేదు. మంచం పట్టారాయన.

* * *

వారం రోజుల తర్వాత పెళ్ళివారు ఎక్కడివాళ్ళు అక్కడ వెళ్ళిపోయారు. అందరితోనూ "మీరేమి అనుకోకండి. అయన్ను ఏమీ అనకండి మాగ్రిహచారం అట్లా ఉన్నది. అట్లాఅయింది" అంటూ వాళ్ళ వాళ్ళ గొలుసులూ, నెక్లెసులూ అవి ఎన్నెన్ని తులాలవో ఏయే నమోనాలలో చేసినవో, ఆయా వివరాలన్నీ జాగ్రత్తగా వ్రాసుకొని ఆ కాగితాలన్నీ ఇనస్పెక్టరుగారికి అందజేశాడు కేశవరావు. బంధువులంతా వెళ్ళాక అతను ప్రొద్దస్తమానమూ స్టేషనుకు వెళ్ళిరావటమే పనిగా పెట్టుకొన్నాడు మరో నాలుగురోజుల తర్వాత చెల్లెళ్ళు కూడా అత్తవారిళ్ళకు వెళ్ళిపోయారు వెళుతూ అతని చెల్లెలు "ఒరేయ్ అన్నయ్యా! నువ్వు మరీ హైరాన పడి ఒళ్ళు పాడుచేసుకోకు అదృష్టం ఉండి దొరుకుతాయా దొరుకుతాయి, లేదా లేదు. మేమెవ్వరమూ పరాయివాళ్ళంకాదుగా. బయటివాళ్ళవి మాత్రం నిదానంగా చేయించి ఇద్దాం. వరే ఏదెల్లా ఉన్నా నువ్వు కూడా బెంగపెట్టుకొని మనస్సు పాడుచేసుకోకు. నాన్న దిగులు పడ్డాడు. నాన్నకు కాస్త ధైర్యం చెప్పి అయన్ను మామూలు మనిషిని చెయ్యి" అని చెప్పి వెళ్ళారు

అతనందుకు సర్వవిధాలా ప్రియత్నం చేశాడు. కొన్నాళ్ళ తర్వాత అది మాటలతో అయ్యే పనికాదని తెలిసింది కేశవరావుకి. చౌదరిగారు అషాక్ నుండి తేరుకోలేదు. చౌదరిగారి భార్యమాత్రం మర్నాటికల్లా తేరుకొని "మన ఖర్మగ" అనుకొని వూరుకోగలిగింది. కాని అయన అల్లా ఊరుకోలేక పోయారు.

ఎప్పుడూ అవిషయమే ఆలోచిస్తూ పడుకొన్నారు "ఏదో ఒకఏడు పంటలు దెబ్బతిని నష్టపడటంకాదు. ఒక వ్యాపారంచేసి డబ్బు పోగొట్టుకోడం కాదు. ఇదేమి అన్యాయం! జీవితమంతా కష్టపడి సంపాదించినదంతా కలుపుకొన్నా యాభై వేలుండదే! అటువంటిది అంతసొమ్ము నాఘోరపాటువల్ల పోయింది. అని అనుకొంటూ అయన దిగులు పడి పోయారు.

ఆయన దిగులు తగ్గించడానికి కేశవరావు తానూ ఇనస్పెక్టరుగారూ కలిసి చేస్తున్న ప్రయత్నాలన్నీ ఎప్పటికప్పుడు వివరంగా చెబుతూనే వున్నాడు. ఆయనకు దిగులు తగ్గలేదు.

“ఇనస్పెక్టరుగారు ఈ కేసులో చాలా శ్రద్ధగా పని చేస్తున్నారు. ఇద్దరు సి. ఐ డీ లు పైనుంచి వచ్చారు. వాళ్ళు హమేషా తిరుగుతున్నారు. ఆ నగలు ఈ చుట్టుపట్ల వంద మైళ్ళు దూరంలో ఎక్కడ అమ్మినా సరే పట్టుకోడానికి ఏర్పాట్లు జరిగాయి” అని అంటూ సవిస్తరంగా వారికి ఆ విషయాలు చెబుతూనే ఉన్నాడు కేశవరావు. కాని వారికి ప్రయత్నాలలో నమ్మకం కలుగలేదు. కాలం గడిచిపోయింది

“చూశావా అరునెలలు గడిచిపొయ్యాయి. ఇంకా ఎందుకీ ప్రయత్నాలన్నీ. పోయిన సొమ్ము పోగా వీటికోసం ఎంత ఖర్చు పెడుతున్నావో నీకే తెలియాలి” అన్నారు చౌదరిగారు ఒకరోజున.

ఆమాట నిజమే తాను అందుకు ఎంత ఖర్చు పెడుతున్నాడో తనకే తెలీదు. డబ్బుకు డబ్బూ, శ్రమకు శ్రమా వృధా అయిపోవడం అలా చాలా సార్లు జరిగింది. అయినా అతను వేటికీ లెక్కచేయకుండా ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు పెట్టిపోయి ఎనిమిది నెలలు గడిచిపోయాయి.

అందరూ విసుగెత్తి పోయారు. చౌదరిగారు ఒక నిశ్చయానికి వచ్చారు. ఒకరోజున కేశవరావు దగ్గరకు పిల్చి “ఒరేయ్ నువ్వు ఇక ఆ ప్రయత్నం మానేయి. ఇక లాభంలేదు. మన వాళ్ళంతా ఏమను కొంటున్నారో ఏమో! చూసూ! ఉన్నపొలం బేరంపెట్టు. ఏకాడికో కాడికి అమ్మిపారేయి. ఆ వచ్చినడబ్బుతో తెనాలి వెళ్ళి నగలవీ చేయించి ఎవరికేమి యిచ్చావో వాళ్ళకవన్నీ ఇచ్చేసిరా! అప్పుడుగాని నామనస్సు కుదుటపడదు. మనం ఎవరిదన్నా పదిఎకరాలు కవులు తీసికొని..” అని అంటూ ఆయన చాలసేపు కొడుక్కు అన్ని విషయాలు వివరంగా చెప్పారు.

వారం రోజులు గడిచాక చౌదరిగారు అతన్ని పిల్చి “ఏంరా బేరం పెట్టావా తూర్పుపొలం ధర ఎంతపలుకుతోంది?” అని అడిగారు. అతను చెప్పిన సమాధానంమీద ఆయనకు నమ్మకం కలగలేదు. “అయితే నువ్వు

బేరం పెట్టలేదన్నమాట ఒరేయి చూడు! చెడితే మనం చెడదాం అంతేగాని లోకుల్ని చెడనీయొద్దు వాళ్ళునమ్మి నాచేతికిచ్చారు. నేను వాళ్లకు వాళ్ల వస్తువు తిరిగి ఇవ్వాలి. అది ధర్మం. అలాచేయకుండానేను యీవూళ్ళో తలయెత్తుకొని తిరగలేను. ఇంతబాధతో నేను అసలు బ్రతుకలేనురా" అంటూ ఆయన రొప్పుతూ వెనక్కు వాలిపోయారు.

అతను భయపడి "ఇక అయన చెప్పినట్లు చెయ్యకపోతే పరిస్థితి ముదిరేలాగుంది," అని అనుకున్నాడు. అటు విషయం చూద్దామా ఎన్నివిధాల ప్రయత్నం జరగాలో అన్నివిధాలా ప్రయత్నం జరిగింది ఆరోజు పెట్టెపోయిన రాత్రి డ్యూటీలో ఉన్న కూలీలందరిమీద నిఘా వేసి ఉంచడం, వాళ్ళను అనేకసార్లు బెదిరించడం వంటివన్నీ జరిగాయి. కూలీలవల్లగానీ, సి. ఐ. డీల వల్లగానీ ఇంతవరకూ ఎటువంటి ఆచూకీ దొరకలేదు. ఎనిమిది నెలలు గడిచి పొయ్యాయి. నాకింకా దొరుకుతుందనే భ్రమ పోలేదు. ఇట్లాగే కాలయాపనచేస్తే ఇక ఆయన కోలుకోవడం అంటూ ఉండదేమో!" అనుకొన్నాడు, అతను.

"పోయినసొమ్ము దొరుకుతుందనుకోవడం నాభ్రమ. అంత తప్ప మరేంలేదు. ఇక అలాంటప్పుడు ఆయనమాట వినడం మంచిది. వినకపోతే వున్న దిగుతేకాకుండా ఇటువంటి విపత్కర పరిస్థితులలో నేను ఎదురు తిరుగుతున్నాను అన్న దిగులుకూడా పట్టుకుంటుంది" అని కూడా భయపడ్డాడు కేశవరావు.

అందువల్ల అతను పొలం బేరం పెట్టాడు. ఇంక ఈమాట ఖరారు అనుకోవడం కూడా జరిగిపోయింది ఆ మర్నాడు రిజిస్ట్రారు కచేరికి వెళ్ళి సంతకాలు చేసుకొని రొక్కం పుచ్చుకోవడమే తరువాయిగా ఉన్నది.

ఆరోజు ఆదివారం సాయంత్రం నాలుగు కావస్తున్నది కేశవరావు ఇంటిలో అందరితోనూ జరిగిన ఏర్పాట్లను గురించి చెప్పాడు. అందరూ దిగులు దిగులుగా కన్పించారు. ఇంటిలో ఊరికే ఏదో ఆలోచిస్తూ కూర్చో డానికి మనస్కరించక బైటకు వచ్చాడు కేశవరావు. "ముందు ఎలా గడుస్తుంది?" అన్న ప్రశ్న అతన్ని అడుగడుగునా నిలవేసి అడ్డుకుంటూ

ఉండగా అతను పెద్దవీధిగుండా నెమ్మదిగా తలవంచుకొని వెడుతున్నాడు. ఒకవంక— అదృష్టంవుంటే దొరకొచ్చు-అన్న ఆశ. మరొకవంక ఇన్ని నెలలు ఇంతమంది ఇన్నివిధాల ప్రయత్నిస్తే దొరకందీ ఇకపై దొరుకుతుందా ఏమిటోలే అన్న నిరాశ. ఆశా నిరాశల మధ్యపడి అతడు నలిగిపోయాడు. గుండెల్లో ఏదో బాధగా అనిపించింది. తలవంచుకుని కొంచెం వేగంగా నడిచాడు కేశవరావు.

పెద్దవీధిలో చివరిఇల్లు అవూరి బడిపంతులుగారిది. ఆపంతులుగారి అబ్బాయీ, కేశవరావూచిరకాల మిత్రులు. కేశవరావు వారింటిముందరగా వెళుతూ ఆయింటి గుమ్మం కేసి చూచాడు.

వాకిట్లో పంతులుగారబ్బాయి శర్మ నిలబడి ఉన్నాడు. కేశవరావు కనిపించగానే ఒక్క అంగిలో ముందుకు వచ్చి అతన్ని గాఢంగా కౌగలించుకొని "ఏం అప్పుడే ఎవరు చెప్పారోయ్ నేను వచ్చానని అడిగాడు. "ఎవ్వరూ చెప్పలా, తోచక నేనే ఆలా బయలుదేరాను. రా నువ్వు వస్తావా ఆటు?" అన్నాడు కేశవరావు.

"ఆ మరి ఆలస్యమెందుకూ పద" అంటూనే కేశవరావుతోబాటు బయలుదేరాడు శర్మ. ఇద్దరూ కొంతదూరం నడిచారు వేగంగా.

"ఏమోయ్ కేశవరావు మీ నాన్నతోపాటు నువ్వూ దిగులుపడ్డావా? అందరూ ఇలా అధైర్యపడితే ఎలా? అరె ఏమిటా మౌనం, అదే నాకు గిట్టదు. ముందు విషయం అంతా నాకు వివరంగా చెప్పు. ఇందాక మాఅమ్మ చెప్పిందిలే క్లుప్తంగా. కాని నాకు నమ్మకం కుదరడం లేదు. అహ అదికాదు నువ్వు చెప్పు వివరంగా" అని శర్మ గబగబా మాట్లాడేస్తుంటే కేశవరావు నెమ్మదిగా "నడుచెప్తాను" అన్నాడు.

ఇద్దరూ కలిసి నెమ్మదిగా నడుస్తూ బస్తీకి వెళ్ళారు. తెనాలి వచ్చేలోపలే అతను జరిగినసంగతంతా మొదటినుంచి చివరిదాకా పూస గుచ్చినట్లు చెప్పాడు శర్మకు. అంతా చెప్పి "అంతా విన్నావుకదా! ఇప్పుడు నేను చేస్తున్నదానిలో నాతప్పేమన్నా వున్నదంటావా?" అని అడిగాడు

కేశవరావు. ఆమాటకు శర్మ "అబ్బే ఏమీలేదు. ఈపరిస్థితులలో నువ్వుకాని మరొకరు కాని ఇంకోలా వెయ్యడానికేముంది? సరే యింక ఆ విషయం వదిలెయ్యి. కాసేపు మనమా గొడవ మర్చిపోదాం. మీలో ఎవరికైనా అదృష్టముంటే దొరుకుతుంది. సరే పద సినిమాకు పోదాం" అని కేశవరావు వద్దంటున్నా అతన్ని శర్మ బలవంతంపెట్టి మొదటి ఆట సినిమాకు లాక్కొని పోయాడు. సినిమా అయిపోవస్తూండగా "ఇదిగో శర్మా, మా నగలు దొరుకుతాయంటావా అని కేశవరావు అడిగితే, "అసలా పెట్టె పగలగొట్టడానికి వాళ్ళు ప్రయత్నం చేసేటప్పుడే మనకు దొరకాలి. అదొక్కటే అవకాశం. ఎప్పటికైనా పెట్టె బయటపడాలిగా." అన్నాడు శర్మ ఏదో ఆలోచిస్తూ.

సినిమాహాలునుండి వంతెనదాకా వచ్చేసరికి పదిన్నర దాటింది. ముందెక్కడైనా యింత కాఫీ తాగాలి" అన్నాడు శర్మ. "ఇప్పుడేం కాఫీ? పదకొండు కావస్తుంటే ఏహోటలూ వుండదు. ఇంటికి పోదాం పద రేపు తెల్లవారకముందే మంచిచెంబుడు కాఫీ ఇప్పిస్తా. ఈవారా ఆవారా అప్పుడు తాగుదుగాని" అని కేశవరావు ఎంత చెప్పినా వినక, "స్టేషను దగ్గర ఒక చిన్న హోటలుంది. అది రాత్రంతా తీసే వుంటుంది. అక్కడకు పోదాంపద" అని లాక్కొనిపోయాడు శర్మ.

స్టేషనుదాకా వచ్చేసరికి పదకొండు కూడా దాటింది. స్టేషనుకు ఒక వందగజాల దూరంలో సిమెంటు రోడ్డు విడిచిపెట్టి సందులోకి మళ్ళితే కన్పిస్తుంది ఆ హోటలు, అదీ తెలిసినవాళ్లకు. ఇతర చోట్లకన్నా ధరలు తక్కువే అయినా అక్కడికి పగటిపూటకూడా ఎక్కువమంది రారు. రాత్రిళ్ళు అల్లరి చిల్లరి మనుష్యులు తప్ప మిగతావాళ్ళెవరూ ఆ హోటలుకు రారని ప్రతీతి. ఏది ఎల్లా ఉన్నా అక్కడ రాత్రింబవళ్ళు కాఫీ దొరుకుతుంది. ఒట్టి

కాఫీ ఫలహారాలుకాక కూలీ జనాలకు అన్నంపొట్లాలు అమ్ముతా రక్కడ. కొంచెం అన్నం తిని, టీనీళ్లు తాగి పోతూంటారు స్టేషనుకు వచ్చిన కూలీ జనం. పెంకుటింట్లో ముందున్న పెద్దగదినే తడిక అడ్డం పెట్టి రెండుగదులు చేశారు. ముందుగదిలో కాఫీలు అవీ ఇస్తారు. వెనక గదిలో అన్నం అదీ అమ్ముతారు.

"అబ్బబ్బ ఇక్కడ కాఫీ ఏమిటోయ్! నే మాత్రం త్రాగను" అంటున్నా వినక శర్మ అతన్ని లోపలకు లాక్కొని వెళ్ళాడు. ఇద్దరూ ఒక మూల కూర్చున్నారు. అయ్యరు వచ్చి కాఫీలు తెచ్చి డబ్బులు వసూలు చేసుకుని వెళ్లిపోయాడు.

కాఫీ బాగా లేకపోయినా ఏదో స్పెన్సరుకాఫి త్రాగుతున్నట్లుగా ఆప్యాయంగా చప్పరిస్తూ కబుర్లు మొదలుపెట్టాడు శర్మ. "త్వరగా కానివ్వవోయ్–ఇక్కడేనా మన కబుర్లు?" అని కేశవరావు తొందరపెట్టినా అతను వినిపించుకోక పావుగంటకు పైగా అయినా కదల్లేదు. "నువ్వేం కదిలేట్లు లేవే లాక్కొని పోవాలా ఏమిటి?" అన్నాడు కేశవరావు "కాదోయ్ మీవిషయమే ఆలోచిస్తున్నా, ఏం చేస్తే బాగుంటుందా అని. శర్మమాటకు "ఇప్పుడు నువ్వూ, నేనూ ఆలోచించేదేం లేదు కరణంగారు కాగితాలు అవీ వ్రాయడమైంది. రేపు రిజిష్ట్రారు కచేరీకి వెళ్ళి మన డబ్బు మనం పుచ్చుకొని పున్న పొలం అంతా వాళ్ళపేర రిజిస్టరు చేసి రావడమే తరువాయి. మరి పోదాం పద. దారంతా చీకటిగా ఉంటుంది" అన్నాడు కేశవరావు, విసుగ్గా శర్మ మౌనం వహించి ఊరుకున్నాడు కొంతసేపు ఇంతలో అవతలనుంచి ఏవో మాటలు వినిపిస్తున్నాయి,

"ఇంత బుకారా చేస్తున్నావు–పైగా దానికికూడా పది పరకా ఇస్తున్నావటగా! నాకో నాల్గు ఇవ్వరా అంటే లేదు పొమ్మంటావ్ ఏడ్నుంచి తెస్తున్నావేంటి? పై సంపాదనేమైనా మళ్ళీ మొదలెట్టావా?"

"లేదు, సెట్టి అప్పిస్తున్నాడు."

"ఏంపెట్టి తీరుస్తావు ?"

"అది ఉందిగా !"

"ఉంది, ఏం లాభం ?"

"ఏం అట్టంటావ్? అస లేంటి నువ్వనేది ?"

"అం ఏం లేదు. ఇన్నేళ్లు గడిచిపోయినాయి, నాకో రాగికానీ చేతికి రాలేదుగందా - అని అంటున్నాను.

"అదా నీ ఏడుపు. తొందరపడితే ఎట్లా?"

సంభాషణ ఒక్క క్షణం ఆగిపోయింది. ఇవతల, వాళ్ళ మాటలు వింటూన్న కేశవరావూ, శర్మా ఇద్దరూ ఒకరిముఖాలు ఒకరు చూచు కొన్నారు. శర్మ చెవులు దోరగిల పెట్టుకొని వింటున్నాడు కేశవరావు నిలబడి అతని చెవిలో "అనుమానం కలగడంలా ?" అని అడిగాడు. శర్మ అతనిని మాట్లాడకుండా కూర్చోమని పంజ్ఞచేసి చెప్పాడు. మళ్ళీ అంతలో తడిక అవతలనుండి మాటలు విన్పించాయి.

"సరే ఇంకెన్నాళ్ళురా దాన్నలా ఆ గంగానమ్మబావిలో వానేసి ఉంచడం ? మరి సెడవట్టా అవి ?

"నీ మొహం, ఏడిసినట్టే ఉంది నీ తెలివి, నువ్వాను - బంగారం సెడుతుందా? అసలు నువ్వగమ్మకుండరా. ఈ వూసు ఎక్కడా ఎత్తొద్దురా అని సెప్పలా ? కూడు తినటం తొందరగా కానీ పోదాం."

అటు వాళ్ళ సంభాషణ ఆగగానే, ఇటు కేశవరావు లేచి నిలబడి వాళ్ళు ఉన్న గదిలోకి పోతూంటే శర్మ అతన్ని వారించి బయటకు లాక్కొని వచ్చి "నువ్వన్నటికీ తొందర పడతావేం ? నువ్వు వెళ్ళి పట్టుకోబోతే వాళ్ళు ఒప్పుకుంటారా ? వెనక అన్నీ పాకలు. అదో పద్మవ్యూహం. పైగా

ఆ అవసరం లేదు! ముందు నువ్వు ఇలా రా" అని అతన్ని కొంచెం దూరం తీసుకొని వెళ్లి, పథకం అంతా చెప్పాడు వివరంగా. సరే అంటే సరే అనుకొన్నారు ఇద్దరున్నూ.

ఇద్దరూ చెరో వైపుకు పెద్ద పెద్ద అంగలు వేసుకొంటూ ముందుకు సాగిపోయారు.

అరగంట తర్వాత అందరూ గంగానమ్మబావి దగ్గర కలుసుకున్నారు. ఇద్దరు ఉప్పరివాళ్లు లోపలికి దిగి, అంతా కెలికి గంటసేపు తంటాలుపడి చివరకు ఊబిలో కూరుకొనిపోయిఉన్న పెట్టెను బయటకు తీసి మోకులు కట్టి పైకి లాగి బయట పడేశారు నేలమీద.

తాళాలు లాగి చూసాడు కేశవరావు. అప్పటిదాకా "వీళ్లు లోపల నగలు కాచేసి ఖాళీపెట్టె ఇందులో పడేసి ఉండవచ్చు" అని సంశయిస్తున్న ఇనస్పెక్టరుకూడా ముందుకు వచ్చి దాన్ని ఒకసారి పరీక్షగా ఎత్తి, క్రింది భాగం పైకి, పై భాగం క్రిందకూ వచ్చేలా దొర్లించి చూచి ఆ పెట్టెను వాళ్లు పగులగొట్టలేదని నిర్ధారణ చేసికొని కేశవరావువైపు తిరిగి "ఇది చాలా చిత్రంగా దొరికింది సుమండీ" అన్నారు.

కేశవరావు, శర్మ వంకకు తిరిగి "ఇది నీవల్లే దొరికింది. నీవేదో ప్లానువేసి చేసినట్లున్నావు ఇదంతా, అవునా?" అని అడిగాడు.

"అవుననే అంటాను, ప్లాను నాది. అదృష్టం నీది. క్రెడిట్ మన ఇనస్పెక్టరుగారిది." అన్నాడు శర్మ నవ్వుతూ.

—:★:—